బోగోలులో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీవో

విశాలాంధ్ర–బిట్రగుంట : బోగోలులోని పలుపోలింగ్ కేంద్రాలను శుక్రవారం కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి సీనా నాయక్ తాసిల్దార్ వెంకటరత్నంతో కలిసి పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కేంద్రాల స్థితిగతులు తీసుకోవలసిన చర్యలపై రెవెన్యూ సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల పరిషత్ అభివృద్ధి అధికారి షమీముల్లా పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు వీఆర్వోలు సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు జిల్లా

శనివారం 23, మార్చి 2024 4పేజీలు

సోమిరెడ్డి రైతులకు చేసిన ద్రోహాన్ని ప్రజలకు వివరిస్తాం

విశాలాంధ్ర బ్యూరో– నెల్లూరు: సోమిరెడ్డికి టిక్కెట్టు ఇవ్వకపోతే ఆయన చేసిన అవినీతి, అక్రమాలు గురించి ప్రజలకు చెప్పే అవకాశం చేజారిపోతుంది అనుకున్నా. ఎట్టకేలకు సోమిరెడ్డికి మూడవ జాబితాలోనైనా స్థానం కల్పించడం సంతోషం. సోమిరెడ్డి రైతులకు చేసిన ద్రోహాన్ని ఊరు ఊరు తిరిగి వివరిస్తా అని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వరుసగా నాలుగు సార్లు ఓడిపోయి సోమిరెడ్డికి మరోసారి ఓటమి ఖాయం అన్నారు. రాజకీయంగా పరిణితి చెందిన సోమిరెడ్డి జిల్లా అధికారులపై తీవ్ర విమర్శలు చేయడం సరికాదు అన్నారు. సైదాపురంలో అక్రమగనుల తవ్వకాల పైఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తాన్నారుదమ్ముంటే సిబిఐ విచారణ కోరాలిఅక్రమ మైనింగ్ పై విచారణ జరపాలని నేను ప్రభుత్వానికి లేఖ రాశా సైదాపురంలో గనుల యజమానుల వద్ద సోమిరెడ్డి ముడుపులు తీసుకున్నారు. పొదలకూరు లో 500.కోట్ల విలువైన తెల్లరాయి ని తవ్వి స్టాక్ చేసారని సోమిరెడ్డి ఆరోపించారు5 కోట్లు ఆయన చెల్లిస్తే..ఆ స్టాక్ ఇచ్చేలా ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని కోరుతానన్నారు. దీనికి సోమిరెడ్డి సిద్ధమా అక్రమ మైనింగ్ పై విచారణ కు రావాలియాష్ పాండ్ లో కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు తీసుకున్నారు గతంలో ఆయన మద్దతుదారులు ఇసుక ను అక్రమంగా రవాణా చేశారు కోర్టులో దొంగతనంపై సిబిఐ విచారణ నేను కోరాను. ఆ కేసులో సిబిఐ తన పాత్ర లేదని తేల్చింది. దీనిని కూడా సోమిరెడ్డి సహించలేక పోతున్నారు. ఆయనను ఎన్నికల్లో ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నా అని మంత్రి గోవర్ధన్ రెడ్డి అన్నారు.

జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులలో తనిఖీలు చేపట్టాలి: ఎన్నికల అధికారి

విశాలాంధ్ర బ్యూరో– నెల్లూరు : రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలోనగదు అక్రమ రవాణా జరగ కుండా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు నిర్వహించి తనిఖీలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎన్నికల సంధ్బంగా జిల్లా ఎన్నికల అధికారులు తీసుకోవలసిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల జరుతున్ననేపథ్యంలో నగదు రవాణా జరగ కుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే రాజకీయ పార్టీలు ప్రచారాలు ర్యాలీలు చేపట్టే ముందు తప్పనిసరిగా ఎన్నికల ఎన్నికల అధికారుల నుండి అనుమతులు తీసుకోవాలని ఆయన తెలియజేశారు. రాజకీయ పార్టీలు డోర్ టు డోర్ క్యాంపెయిన్లు నిర్వహించే ముందు కూడా ఎన్నికల అధికారుల నుండి అనుమతులు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలకు సంబంధించి ఘర్షణలు వంటివి జరిగినప్పుడు అధికారులు వెంటనే స్పందించాలన్నారు. సంబంధిత సంఘటనలకు సంబంధించిన నివేదికను కూడా ఎన్నికల సంఘానికి తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో ఓట్ల తొలగింపులు, మార్పుల కోసం వచ్చినపెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించ డానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. నెల్లూరు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల సందర్భంగా నగదు అక్రమ రమణా జరగకుండా తనిఖీలు చెప్పడానికి 18 ప్రాంతాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు.

కొండాపురంలో గ్రామసింహాల స్వైర విహారం

- వీధిల్లో కుక్కల సంచారం - భయపడుతున్న జనం - నియంత్రణ చేయాలంటున్న ప్రజలు

విశాలాంధ్ర–కొండాపురం: మండల కేంద్రమైన కొండా పురంలో గ్రామసింహాలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామంలో శునకాల సంతతి విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారులు, వీధులు, శివారు ప్రాంతాలు అనే తేడా లేకుండా అన్నిచోట్లా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. మాంసం దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, భోజనం హెటళ్లు , ఇతర దుకాణాల దగ్గర వీటి తాకిడి మరింత అధికంగా ఉంది. మెయిన్ రోడ్డు, మీసేవ సెంటర్, పోలీస్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితర ప్రాంతాలలో వీటి బెడద మరింత ఎక్కువగా ఉంది. కుక్కల భయంతో వీధుల్లో తిరగాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. పాఠశాలకు వెళ్లే పిల్లలయితే వీధుల్లో నడవాలంటేనే భయంతో హడలిపోతున్నారు. పిల్లలు బయటికి వెళ్లాలంటే పెద్దల తోడు లేకుండా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. రాత్రి సమయంలోనైతే రోడ్లపై ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా సంచరిస్తూ వచ్చి పోయే వారిని భయపెడుతున్నాయి. దీంతో రాత్రి 9 గంటలు దాటితే తిరగలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. భౌ– భౌ అంటూ గోల చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని సైతం వెంటపడుతున్నాయి. వాహనదారులు అదుపుతప్పి కింద పడి గాయపడుతున్నారు. ఆహారం కోసం ప్రజలపై దాడి చేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలో ప్రవేశించి ఆహార పదార్థాలు నాశనం చేస్తున్నాయి. చిన్నారుల చేతిలోని తినుబండారాలు సైతం పట్టుకు పోతున్నాయి. ఇటీవల కాలంలో కొందరు కుక్క కాటుకు గురై చికిత్స తీసుకొన్నారు. నిత్యం ఎక్కడో ఒకచోట శునకాల దాడిలో ఒకరిద్దరు గాయపడుతూనే ఉన్నారు. అధికారులు మాత్రం వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇలానే వదిలేస్తే మరింత మంది కుక్కల దాడికి గురి అయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొండాపురంలో కుక్కలు పట్టాలని ఓవైపు ప్రజలు కోరుకుంటుంటే మరోవైపున ఇతర ప్రాంతాల నుంచి కుక్కలను వాహనాలలో తీసుకువచ్చి గ్రామ శివారులలో వదిలి వెళుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. కుక్క కరిస్తే వచ్చే వ్యాధి రేబిస్. ఈ వైరస్ సోకిన కుక్కలు కరిస్తే రేబిస్ సోకుతుంది. దీనికి టీకా తీసుకోకపోతే పక్షవాతం, కోమా, చివరకు మరణం వరకు వెళ్లే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు తెలుపుతున్నారు. కుక్క కరిచినప్పుడు దాని దంతాలు శరీరం లోపలికి వెళ్లి వైరస్ సోకుతుంది ఇలాంటి సమయంలో యాంటీ రేబిస్ టీకా తీసుకోవాలి. లేకుంటే ప్రాణాపాయ స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే కుక్కలను పట్టుకొని వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసి సంతానాన్ని నియంత్రించాలని, అలాగే కుక్కలకు యాంటీ రేబిస్ ఇంజక్షన్లు వేయాలని ప్రజలు సూచిస్తున్నారు.

రాబోయేది టీడీపీ ప్రభుత్వం: విపిఆర్

విశాలాంధ్ర – కావలి : నెల్లూరు టీడీపీ – జనసేన – బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కావలి టీడీపీ – జనసేన – బీజేపీ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి గురువారం రాత్రి దగదర్తి మండలానికి విచ్చేయడంతో వారికి మద్దతు తెలపడానికి, ఆశీర్వదించడానికి మండలం లోని ఊళ్లకు ఊళ్ళ ప్రజలు తరలి వచ్చారు. మాలే పాటి సోదరుల ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సమక్షంలో నిర్వహించిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల పరిచయ కార్యక్రమానికి దగదర్తి మండల ప్రజలు బ్రహ్మ రథం పట్టారు. జెండాలు చేపట్టి, పూల వర్షం కురిపిస్తూ తెలుగు తమ్ముళ్లు దగదర్తిని పసుపుమయం చేశారు. భారీగా బాణా సంచా పేలుస్తూ, అభిమానులు తమ ఆనం దాన్ని చాటుకున్నారు. డీజే డప్పులతో ఉగ్రూతలూ గించారు. అనంతరం ప్రచార రథం ఎక్కిన నాయ కులు ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీ చేపట్టారు. భారీగా తరలివచ్చిన జనంతో జాతరను మించిన పసుపు జాతర దగదర్తి లో జరిగింది. శాలువ, బొకే లతో అభ్యర్థులు ఇరువురిని సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దగదర్తి మండలం లోని పలువురు నేతలు వైసీపీ నుండి టీడీపీ లో చేరారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ ఎన్నికల అనంతరం జరిగే విజయోత్సవ ర్యాలీ లా పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారని మాలేపాటి సోదరులను అభినం దించారు. 42 సంవత్సరాలుగా టీడీపీ జెండాను రెపరెపలాడిస్తున్న కుటుంబం మాలేపాటి కుటుంబం అని కొనియాడారు. టీడీపీ ప్రభుత్వం తీసుకోచ్చిన డిఎం, డిఆర్ ఛానెల్ పనులు ఈ వైసీపీ 5 ఏళ్ల పాలనలో పూర్తయ్యాయా? అని ప్రశ్నించారు. ఎయిర్ పోర్టు లో ఒక్క ఇటుక అయినా పెట్టారా? అని విమర్శించారు. ఎయిర్ పోర్టు తరలిపోతున్న అడ్డుకోలేక పోయారని అన్నారు. ప్రతి ఒక్కరూ బూత్ లెవెల్ లో కష్టపడి పనిచేసి టీడీపీ కి మెజారిటీ తీసుకురావాలని, ఆగిపోయిన అన్ని పనులను పూర్తి చేసి చూపుతామని ఆయన తెలిపారు. అనంతరం కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికంగా మన ప్రాంతం అభివృద్ధి చెందితేనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. అభివృద్ధి చేసే చంద్రబాబుని మనం గెలిపించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజారిటీ తో గెలిపించాలన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో గెలిచేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, ఇందులో ఎలాంటి సందేహాలు వద్దని అన్నారు. దగదర్తిలో ఎయిర్ పోర్టు ప్రారంభించే విధం గా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఎంపీగా నన్ను, ఎమ్మెల్యే గా క్రిష్ణారెడ్డి ని అఖండ మెజారిటీతో గెలిపిం చాలని, అభివృద్ధి చేసే చంద్రబాబు వస్తేనే రాష్ట్రం గాడిలో పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దగదర్తి మండల అధ్యక్షులు అల్లం హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి చేజర్ల ఇబ్రహీం, కావలి నియోజ కవర్గ పరిశీలకులు బొమ్మి సురేంద్ర, రాష్ట్ర కార్యద ర్శులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పమిడి రవికుమార్ చౌదరి, కావలి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, మాజీ ఆప్కాబ్ చైర్మన్ కొండూరు పాల్ శెట్టి, శ్రీహరి నాయుడు, పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడినిన వారిని
పరామర్శించిన ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు

విశాలాంధ్ర- వలేటివారి పాలెం: అంక భూపాలపురం గ్రామం మాదిగ కులమునకు చెందిన మంగి పేరయ్య, మంగి మాలకొండయ్య గత కొద్దిరోజుల క్రితం కారు ప్రమాదానికి గురై రెండు కాళ్లు చేతులు విరిగి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటున్న జాతియ ఉపాధ్యక్షులు జలదంకి నరసింగరావు మాదిగ, జిల్లా అధ్యక్షులు నేలపాటి రాజు మాదిగ ప్రమాదానికి గురైన వారి ఇంటికి వెళ్లి పేరయ్య అనే వ్యక్తికి రెండు కాలు విరిగిన్నాయి అదేవిధంగా మాలకొండయ్యకు కుడి చెయ్య పక్క ఎముకలు విరిగినాయి. ఆ కుటుంబాలకు అధర్య పడవద్దు ధైర్యంగా ఉంటే మీకు అండగా ఉంటుందని తరపున కొంత ఆర్థిక సహాయం కూడా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి: సిడిపిఓ

విశాలాంధ్ర-మనుబోలు : ప్రతి ఒక్క రు తప్పనిసరిగా తాము తీసుకునే ఆహారంలో పోషక విలువలు కలిగి ఉండేలా చూసు కోవాలని ఐసిడిఎస్ వెంకటాచలం ప్రాజెక్ట్ సిడిపిఓ విజయలక్ష్మి తెలిపారు.శుక్రవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం సెక్టార్ పరిధిలోని కొమ్మలపూడి అంగన్వాడీ కేంద్రంలో జరిగింది.ఈ సందర్భంగా బాలింతలు, గర్భవతులు ను ఉద్దేశించి వారు మాట్లాడుతూ బాలింతలు గర్భవతులు తప్పనిసరిగా చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఆమె బాలింతలకు గర్భవతులకు ప్రభుత్వాలు పంపిణీ చేసిన పౌష్టికాహార కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో మడమనూరు (సెక్టర్) సూపర్వైజర్ పద్మ అంగన్వాడి వర్కర్లు సీతారావమ్మ, సంతోష్ మ్మ, రమణమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

బస్‌స్టాండ్ సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: ప్రజావసరాలకు ముందుండే తన వంతు సహాయం అందించే కందుకూరు సురేష్ రెడ్డి చికెన్ సెంటర్ అధినేత సన్నారెడ్డి సురేష్ రెడ్డి ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా తన తండ్రి గారైన సన్నారెడ్డి రామి రెడ్డి పేరు మీద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ వేసవి కాలంలో ప్రజల దాహార్తి ని తీర్చేందుకు నిరంతరం మంచి నీరు అందించే చలివేంద్రాన్ని స్థానిక పామూరు బస్ స్టాండ్ సెంటర్ లో సురేష్ రెడ్డి చిన్న కుమారుడు సన్నారెడ్డి మోహన్ కిషోర్ రెడ్డి ప్రారంభించారు.

రాజుపాలెంలో వైద్య సిబ్బంది సర్వే- పరీక్షకు నీటి నమూనాలు

విశాలాంధ్ర-లింగసముద్రం: మండల పరిధిలోని రాచెర్వు రాజుపాలెం గ్రామం లో ప్రతి ఇంటిని ఆరు టీములు ద్వారా సందర్శించి జ్వరపు కేసుల నమోదును డెంగ్యూ లార్వా సర్వే చేశారు. ఈ సర్వేలో కొత్తగా జ్వరం కేసులు మూడు నమోదు చేశారు. వారికి వారి రక్త నమూనాలు సేకరించి వాటిని కందుకూరు ఏరియా హాస్పిటలకు ఎలిసా నిర్ధారణ కోసం పరీక్షకు పంపారు. ఓవర్ హెడ్ టాంక్ చాల పాతది అయి,దాని పైన ఉన్న పెచ్చులు ఊడి టాంక్ నీరులో పడుతున్నందువలన నీరు కలుషితమై దుమ్ము ధూళితో నిండి ఉన్నది. దాని గురించి గ్రామ సర్పంచ్‌కి వివరించి శుభ్రం చేసి బ్లీచింగ్ ను కలిపి క్లోరినేషన్ చేయాలని సూచించారు.

సర్వేపల్లిలో భారీ మెజార్టీతో గెలుస్తాం: ఉప సర్పంచ్

విశాలాంధ్ర-మనుబోలు : సర్వేపల్లి నియోజకవర్గంలో గత రెండుసార్లు కంటే భారీ మెజార్టీతో గెలుస్తామని మనుబోలు ఉపసర్పంచ్ జే.స్ యస్,మండల కన్వీనర్ కడివేటి చంద్రశేఖర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కాకాని ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా గడపగడపకి సంక్షేమ పథకాలు నియోజకవర్గ అభివృద్ధి ఐదేళ్లపాటు చేశామని అన్నారు. గ్రామాల్లొ ప్రచారంకి వెళుతుంటే గ్రామంలో ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని అన్నారు. ఈసారి సుమారు 30000 మెజార్టీ తధ్యమని అన్నారు. ఆదివారం మండలంలో మంత్రి కాకాని ఎన్నికల ప్రచారంలో భాగంగా కొలనుకుదురు కట్టుపల్లి గ్రామాలకు విచ్చేయుచున్నారని, మండలంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సర్వేపల్లి గడ్డ కాకాని అడ్డా అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముంగర రవింద్రరెడ్డి, అంకయ్య, నవకోటి, గుంజిరమేష్, తులశిరామ్ యాదవ్,తథితరులు వున్నారు.

మతతత్వ పార్టీతో టిడిపి పొత్తు:కాకాని

విశాలాంధ్ర ముత్తుకూరు: ముస్లిం మైనారిటీ పార్టీలకు వ్యతిరేకమైన మతత్వ పార్టీ అయినా బిజెపితో టిడిపి పొత్తు పెట్టుకుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో మత్తతో పార్టీ బిజెపి, జనసేనతో పుత్తుపెట్టుకున్న టిడిపి ఆ ఎన్నికల్లో విజయం సాధించడం జరిగిందన్నారు. అయితే అప్పట్లో అధికారం రావడంతో సుమారు 2000 పాటు మాత్రమే కలిసి ఉన్నారని అనంతరం విభేదాలు వచ్చి విడిపోవడం జరిగిందన్నారు. తిరిగి 2024 ఎన్నికల్లో అదే కూటమి ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని చంద్రబాబు నాయుడు కావాలా, ఇచ్చిన హామీల నెరవేర్చిన జగన్మోహన్ రెడ్డి కావాలా అనేది రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకుంటారని ఆయన తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో, ముత్తుకూరు మండలంలో దీర్ఘకాలికంగా ఉన్న అనేక సమస్యలను తాను పరిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 60 శాతం కు పైగా సంక్షేమ పథకాలను పొందిన ప్రజలే నేడు వైసీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. అనంతరం స్థానిక మసీదులో రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, జయలక్ష్మి, జడ్పిటిసి సభ్యులు బందుల వెంకట రమణయ్య,నాయకులు నెల్లూరు శివప్రసాద్, మునుకూరు రవికుమార్ రెడ్డి, కాకుటూరు లక్ష్మణ రెడ్డి, ఈదూరు రామ్మోహన్ రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రావు, ఆలపాక సీనయ్య, మారు సుధాకర్ రెడ్డి, వెంకటాచలపతి, కనకయ్య, శ్రీధర్ రెడ్డి, మురాల వెంకటేశ్వర్లు, జమీల్ భాష, మస్తాన్, ఎంపీటీసీ శివ, జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టికెట్ కేటాయింపు పై రాష్ట్ర మైనార్టీ నాయకుల హర్షం

విశాలాంధ్ర:-మనుబోలు : సర్వేపల్లి నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కు శుక్రవారం తెలుగుదేశం అధిష్టానం టికెట్ కేటాయించడంతో సర్వేపల్లి నియోజకవర్గం ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకుడు అమీర్ భాష హర్షం చేశారు రాబోయే ఎన్నికల్లో పిసి నాయకులందరూ కలసి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు అంతేకాకుండా మనుబోలు మండల వ్యాప్తంగా ఇంటింటా తిరిగి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి సోమిరెడ్డి గెలుపుకు అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు ముఖ్యంగా ఐదేళ్లపాటు అధికారం పక్షం చేసిన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడమే ముఖ్య ఉద్దేశం అన్నారు అదేవిధంగా రెండుసార్లు ఓటమి పాలైన సోమిరెడ్డికి మూడోసారి సర్వేపల్లి ప్రజల అండగా నిలవాలన్నారు.

మండలంలో పోషకాహార పక్షోత్సవాలు

విశాలాంధ్ర-బిట్రగుంట: చెంచులక్ష్మీపురం 2 సిద్దవరం వెంకటేశ్వరపాలెం గ్రామాలలో ఆయా సెక్టార్ల సూపర్వైజర్లు కోటేశ్వరి సుభాషిని ఆధ్వర్యంలో శుక్రవారం పోషకాహారపక్షోత్సవాలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా హాజరైన గర్భవతులు బాలింతలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ బలవర్ధకమైన ఆహారాన్ని సమపాళ్లలో తీసుకోవడం వలన తల్లి బిడ్డ శ్రేయస్కరంగా ఉంటారని చిరుధాన్యాలు ఆకుకూరలు పోషకాహార లోపాన్ని తగ్గించి ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వడంతో పాటు శ్రేష్టమైన తల్లిపాలు బిడ్డకు అందించవచ్చు అన్నారు పై కార్యక్రమంలో ఏఎన్ఎం జోష్న ,స్వాతి ఎం ఎల్ హెచ్ పి జాన్, మాధవి పి హెచ్ ఎన్ కృష్ణ అంగన్వాడి కార్యకర్తలు సహాయకులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థుల విజయానికి కృషి చేసాం

- స్పష్టం చేసిన టీడీపీ నేత అమరజీవి రెడ్డి

విశాలాంధ్ర - కావలి : మద్యానికి, డబ్బుకు అమ్ముడుపోయి తెలుగుదేశం పార్టీలో చేరలేదని, అభిమానంతో తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందని పోలీస్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి తమ్ముడు అమరజీవి రెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2001 లో సిద్దనకొండూరు ఎంపిటీసీగా పోటీ చేసి ఓడిపోవడం జరిగిందని, 2002 లో అనంతపురం సర్పంచ్‌గా గెలుపొందడం జరిగిందని, 2007 లో పెద్ద కొండూరు ఎంపిటీసిగా గెలుపొందడం జరిగిందన్నారు. 2009 లో ప్రజారాజ్యం పార్టీ సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి వెంట ఉంటూ ఆయన కోసం పనిచేయడం జరిగిందన్నారు. 2011 లో రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఎమ్మెల్సీ పదవి కోసం పోటీ చేసినప్పుడు, నేను కాంగ్రెస్ పార్టీలో ఉండి కూడా అభిమానంతో ప్రతాప్ రెడ్డి కి ఓటు వేయడం జరిగిందన్నారు. ప్రతి చోట అభిమానంతో పనిచేయడం జరిగిందని, డబ్బులు కోసం కాదని తెలిపారు. నేను అప్పుడు, ఇప్పుడు అనంతపురం కు చెందిన వాడినని తెలిపారు. కావ్య క్రిష్ణారెడ్డి వ్యక్తిత్వం, మంచితనం, నిరాడంబరత నచ్చి ఆయన విజయానికి కృషి చేయాలని ముందుకు రావడం జరిగిందని, ఆయన గెలుపుకు శాయ శక్తుల కృషి చేస్తానని అన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - రాపూరు : రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రము నందు స్వయంభువుగా వెలసి ఉన్న శ్రీ పెనుశిల లక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయం నందు తేదీ గత సంవ త్సరం 27.12.2023 నుండి 22.3. 2024 వరకు అనగా 87 రోజులకు గాను స్వామి వారి ఆలయం నందు ఉన్న హుండీలు లెక్కింపు ద్వారా మొత్తం రూ.93,41,901¯00 మిక్స్ బంగారం ఆభరణములు 000.270 .000గ్రాములు, మిక్స్ వెండి ఆభరణములు కేజీ 004.02 0.000గ్రాములు మరియు విదేశీ కరెన్సీ కువైట్ దినార్లు 5 దినార్లు-1, 1 దినార్లు-13, 1/2 దినార్లు-3, 1/4 దినార్లు-4,సౌదీ అరేబియాన్ రియల్స్50-2,సౌదీ అరేబియాన్ రియల్స్ 10-1,సౌదీ అరేబియాన్ రీయల్స్50-2,యుఎస్ఎ డాలర్స్ 10డాలర్ -1,5 డాలర్స్-9,1 డాల ర్స్-16,యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ దినర్స్50-2,యునైటెడ్ అరబిక్ దినర్స్20-4,సిగపూర్ డాలర్స్ 50-3 ఆదాయం వచ్చినది. హుండిల లెక్కింపు కు ఉప కమిషనర్ మరి యు కార్యనిర్వహణ అధికారి కె వి సాగర్ బాబు ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు, పెంచలకోన ఔట్ పోస్ట్ పోలీస్,జిల్లా ఎస్ బి ఐ బ్యాంక్ రిటైర్డ్ అసోసియేషన్ నెల్లూరువారు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజ ర్ మరియు బ్యాంక్ సిబ్బంది మరి యు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. హుండీ లెక్కింపునకు పర్యవేక్షణ నిమిత్తం జె.శ్రీనివాసరావు నెల్లూరు దేవాదాయ శేఖ అధికారి వారు ఇన్స్పెక్టర్ ఎం సుధీర్ హాజరు కావడం జరిగింది. హుండీల ద్వారా వచ్చిన మొత్తమును ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పెంచలకోన బ్రాంచ్ నకు జమచేయడం జరిగినది.

దాయాదుల తీరుతో అయోమయంలో తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: గత కొంతకాలంగా కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నియామకంలో ఏర్పడిన గందరగోళం నీ తెరదీసి పార్టీ అభ్యర్థిని ఇంటూరు నాగేశ్వరరావుగా తెలుగుదేశం పార్టీ అధినేత ప్రకటించిన నియోజకవర్గంలో మాత్రం తెలుగుతమ్ములలో ఉన్న గందరగోళం కి తెరపడలేదు మొదటనుంచి నియోజకవర్గంలో ఒకే కుటుంబానికి చెందిన ఇంటూరి రాజేష్ మరియు ఇంటూరి నాగేశ్వరరావు లు పార్టీ కోసం తమ వంతు ప్రయత్నం చేస్తూ ఎవరికి వారు పార్టీ టికెట్ తమదే అంటూ ధీమా వ్యక్తం చేస్తూ ముందుకు సాగారు అయితే వీరిద్దరిలో నాగేశ్వరరావుకు సీటు దక్కడం తో ఇంటూరు రాజేష్ వ్యతిరేక స్వరం వినిపిస్తూ తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తాను తమ వెంట తెలుగుదేశం పార్టీ క్యాడర్ ఉందని తన సొంత అజెండాతో మీ ఇంటికి మీ రాజేష్ అనే నినాదంతో తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వీరిద్దరిలో ఏర్పడిన అసకృత వల్ల పార్టీకి నష్టం చేకూరి గెలుపు చేజారుతుందేమో అనే భావన తెలుగు తమ్ముళ్లలోవేదన కలిగిస్తుంది.

సోమిరెడ్డి అభ్యర్థిత్వంపై టిడిపిలో నూతనోత్సాహం

విశాలాంధ్ర-మనుబోలు : సర్వేపల్లి నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి శుక్రవారం ఖరారుకావడంతో టిడిపి పార్టీలో నూతన ఉత్తేజం ఉత్సాహం నెలకొంది.మే 13వ తేదీన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల విషయం పాఠకులకు తెలిసిందే. సర్వేపల్లి నియోజకవర్గం నుండి పలువురు పేర్లు టిడిపి నుండి పోటీ చేస్తున్నారంటూ పుకార్లు షికార్లు చేసాయి. సోమిరెడ్డి పేరు ఖరారు కాదంటూ అధికారపక్షం కూడా సోమిరెడ్డి పై సెటైర్లు వేయడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు చెప్పాలో అర్థం కాక మిన్నకుండి పోయారు. ఏదీ ఏమైనా ఒకానొక సమయంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా అసహనం వ్యక్తం చేసే స్థాయికి వచ్చి తాను టిడిపి బలోపేతానికి కష్టపడ్డానని, చంద్రబాబు ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా అహర్నిశలు కష్టపడ్డానంటూ వాఖ్యానించారు. మొత్తంమీద సర్వేపల్లి నియోజవర్గం నుండి సోమిరెడ్డి పేరు ఖరారు కావడంతో తెలుగుదేశం పార్టీ వర్గీయులు నూతన ఉత్సాహం వచ్చి సోమిరెడ్డి జిందాబాద్ చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు

కాకాణికి కాక చూపిస్తాం :

రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గం లో జరగబోవు ఎన్నికల్లో కాకాణికి కాక పుట్టిస్తామని, చంద్రమోహన్ రెడ్డి విజయం తధ్యమంటూ తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం నాయకుడు పచ్చిపాల రామిరెడ్డి తెలిపారు. మా నాయకుడు సోమిరెడ్డి పై కాకాని గోవర్ధన్ రెడ్డి వ్యంగ్యంగా విమర్శలు చేయడం మానుకోవాలని దమ్ముంటే తమ నాయకుడు సోమిరెడ్డిపై చేస్తున్న ఆరోపణలు నిరూపించాలన్నారు. మనుబోలు మండ లంలోని తెలుగుదేశం పార్టీకి 2000 పైచిలుకు ఓట్ల మెజార్టీ తీసుకొస్తామని ప్రతి ఒక్క కార్యకర్త ఓ సైనికునిలా పనిచేస్తామని తెలిపారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

విశాలాంధ్ర-బిట్రగుంట: బోగోలు మండలం కొండ బిట్రగుంటలో జరుగుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ సహకారంతో ఒంగోలు జూన్ 3 రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ జి పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు విశేషంగా జనం హాజరవుతున్నందున వారికి తమ శాఖద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని ఈ శిబిరం మరో రెండు రోజులపాటు కొనసాగుతుందన్నారు. పై కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి వైద్యులు ఎస్కె హాలీ మౌలాలి, కృష్ణయ్య, రాజనర్సింహం, చంద్రశేఖర్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్సై

విశాలాంధ్ర-గుడ్లూరు: గుడ్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీ చైతన్య హైస్కూల్లో జరుగుతున్న పరీక్షా కేంద్రాలను గుడ్లూరు ఎస్సై లక్ష్మణ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల పరిధిలో 144వ సెక్షన్ అమలులో ఉన్నందువలన ఎవరు కూడా గుంపులు గుంపులుగా ఉండకూడదని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను శాంతియుతంగా పరీక్షలు రాసే విధంగా సమన్వయం చేయాలని ఆయన కోరారు.

బ్రహ్మోత్సవాలలో భక్తులకు అన్నదానాలు

విశాలాంధ్ర -బిట్రగుంట: శ్రీ బిలకూటక్షేత్రం ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్స వాలకు వచ్చే భక్తులకు శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు రావి విజయ్ కుమార్ ఉచితంగా భోజనం పంపిణీ చేశాడు ఈ కార్యక్రమం మరో మూడు రోజులపాటు కొనసాగుతుందన్నారు. దేవస్థానం ప్రాంగణంలోని నాంచారమ్మ అన్నదాన సత్రం బచ్చు అమర చారిటబుల్ ట్రస్ట్ విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం ఆర్యవైశ్య అన్నదాన సత్రాలలో బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు కొదవ లేకుండా భోజనం పంపిణీ చేస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన దాతలు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయగా రైల్వే గేటు సమీపంలో గోపాలమిత్ర మిత్ర బృందం మంచినీరు సరఫరా చేసి భక్తులకు వేసవి తాపాన్ని తీరుస్తున్నారు బ్రహ్మోత్సవాలలో భక్తులకు సహకరిస్తున్న దాతలకు పలువురు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు :ఎంపీడీవో

విశాలాంధ్ర-అనంతసాగరం: మండలకేంద్రమైన అనంతసాగరంలో మండల అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల నియమావళిపై మండల సిబ్బందితో మండల అభివృద్ధిఅధికారి తాజ్ మస్రూర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని, ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు, వాలంటీర్లు మొబైల్ లోని ప్రజాప్రతి నిధుల ఫోటోలను తొలగించేవిధంగా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. గ్రామాలలో ప్రభుత్వ బోర్డులలో ప్రజాప్రతినిధులు ఫోటోలు, ఫ్లెక్సీలు తొలగించాలన్నారు. ఎన్నికల నియమావళి పాటించకపోతే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

వినియోగదారులు భీమా అందుకోవాలి

విశాలాంధ్ర-నెల్లూరు టౌన్: నూతన ఫండ్ ఆఫర్ తో భీమాను వినియోగదారులు అందుకోవాలని, టాటా ప్రతిపాదన నిర్వాహకుడు సమిత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐఏ రైజింగ్ ఇండియా ఫండ్ను విడుదల చేసినట్లు తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ స్టోరీలో పాల్గొనమని వినియోగదారులను ఆహ్వానిస్తుందని తెలిపారు. దేశ ఆర్థిక విస్తరణ, స్వావలంబన కథనాన్ని నడిపించే అధిక అభివృద్ధి రంగాలలో పెట్టుబడి పెట్టడం లక్ష్యం అని తెలిపారు. గత ఏడాదిలో ప్రారంభించిన వాటితో సహ మునుపటి టాటా ఏఐఏ ఫండ్లు స్థిరంగా బెంచ్మార్క్లను అధికమించాయని తెలిపారు. దేశంలోని ప్రముఖ జీవిత బీమా సంస్థల్లో ఒకటైన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఏఐఏ), టాటా ఏఐఏ రైజింగ్ ఇండియా ఫండ్ను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఫండ్ ఆఫర్, టాటా ఏఐఏ రైజింగ్ ఇండియా ఫండ్ ను , ప్రో-ఫిట్, పరమ్ రక్షక్ సొల్యూషన్, పరమ్ రక్షక్ ప్లస్ సొల్యూ షన్ మొదలైన మా ప్రత్యేకమైన పరమ రక్షక్ సిరీస్తో పాటు పొందవచ్చని తెలిపారు.

రోడ్డు పక్కన చెత్తతో రోగాలు

- మండల బిజెపి అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున

విశాలాంధ్ర-కొండాపురం: మండల కేంద్రమైన కొండాపురం ప్రధాన రహదారుల ప్రక్కన పడేస్తున్న చెత్తతో రోగాలు ప్రబలే అవకాశమున్నదని మండల బిజెపి అధ్యక్షులు మాలేపాటి మల్లికార్జున తెలిపారు. శుక్రవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొండాపురం గ్రామంలో సేకరిస్తున్న చెత్తను పంచాయతీ సిబ్బంది కావలి, కందుకూరు మార్గంలో ప్రధాన రహదారి వెంట పడేస్తున్నారని ఆరోపించారు. పారిశుద్ధ్య సిబ్బంది సేకరించిన తడి, పొడి చెత్తను రోడ్డు మార్జిన్ లోనే వదిలి వెళ్తున్నారని తెలిపారు.ఈ చెత్త నిల్వతో దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, చికెన్ గున్యా , విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వాహన రాకపోకల కూడా ఈ చెత్త ఇబ్బందికరంగా ఉందన్నారు. కనుక సేకరించిన చెత్తను సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలని డిమాండ్ చేశారు.

క్షయ వ్యాధి నిర్మూలన కోసం

విశాలాంధ్ర-లింగసముద్రం: మార్చి 24న జరుగు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవంలో భాగంగా శుక్రవారం లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించిన క్షయవ్యాధిగ్రస్తులకు ప్రధానమంత్రి టీబీ ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా 16 మందికి పౌష్టికాహార సంబంధించిన సంచులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అనురాధ సిహెచ్ఓ శ్రీనివాసులు కందుకూరు సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ శ్రీమన్నారాయణ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ మరియు లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా రెండు వారాల నుంచి దగ్గుతో గాని సాయంత్రం వేళల్లో జ్వరంతో గాని ఆకలి మందగించటం గాని ,బరువు తగ్గటం గాని ఇటువంటి లక్షణాలు ఉన్నచో తప్పనిసరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు వచ్చి క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షను చేసుకోవలసినదిగా కోరారు. తద్వారా టీబీ వ్యాధిని నిర్మూలించుటకు అవకాశాలు అధికంగా ఉన్నాయని అవగాహన కల్పించారు.

గ్రామసచివాలయ వాలంటీర్లను తొలగింపు

విశాలాంధ్ర-అనంతసాగరం: మండలంలోని చిలకలమర్రి, గోగులపల్లె గ్రామ సచివాలయం వాలంటీర్లను ఎన్నికల నియమావళి నిబంధనలు ఉల్లంఘించడంతో ఇద్దరు వాలంటీర్లను తొలగించామని మండల ప్రజాభివృద్ధి అధికారి తాజ్ మస్రూర్ శుక్రవారం తెలిపారు. చిలకలమర్రి గ్రామసచివాలయ వాలంటీర్ ఓ ప్రజాప్రతినిధి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నందుకు, గోగులపల్లె గ్రామసచివాలయం వాలంటీర్ సోషల్ మీడియాలో ఓ పార్టీకి మద్దతుగా ప్రచారం చేసినందుకుగాను శుక్రవారం ఇద్దరు వాలంటీర్లను విచారించి తగు చర్యలు తీసుకున్నామని ఎంపీడీఓ తెలిపారు.

ఏపూరు అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ :సిడిపిఓ

విశాలాంధ్ర-రాపూరు : రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు రాపూరు పరిధిలోనిఅంగన్వాడీ కేంద్రాలలో జరుగుతున్న పోషణ పక్వాడ్ కార్యక్రమములో రాపూరు మండలం గోనుపల్లి సెక్టార్ పరిధిలోని ఏపూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఓ సునంద పర్యవేక్షణలో గోనుపల్లి సెక్టర్ అంగన్వాడీ సూపర్ వైజర్ రాజ్యాలక్ష్మి అధ్వర్యంలో తల్లులకు, గర్భవతులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమంలో 0-6 వయస్సు పిల్లల తల్లులందరికి పిల్లలు బరువులు గ్రేడ్ గురించి తెలియపరిచి బరువు తక్కువ ఉన్న పిల్లలకు ఇవ్వవలసిన పోషణ గురించి తల్లులుకు తెలియ పరచి ఎక్కడ కూడా మాతృ మరణాలు, శిశు మరణాలు జరగకుండా చూడవలేనని తెలియజేసి చిరుధాన్యాల అందరు ఉపగించవలెనని సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి తెలియజెసారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

దేశంలో తొలి ఓటరు శ్యామ్ శరణ్ నేగి

విశాలాంధ్ర - కొండాపురం :: రాష్ట్రంలో మే 13న అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో గెలుపు, ఓటములను నిర్ణయించేది ఓటు. దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం ఏర్పాటు అయింది. త్వరలో జరగబోయే ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 90 కోట్ల మంది పైచిలుకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అయితే దేశంలో తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకున్న వ్యక్తిగా హిమాచల్ ప్రదేశ్ కు చెందిన శ్యామ్ శరణ్ నేగి గుర్తింపు పొందారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు అయిన నేగి 1951 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అక్టోబర్ 25న తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2014 నుంచి 2022లో మరణించే వరకు ఆయన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల బ్రాండ్ అంబాసిడర్ గా కొనసాగారు. వందేళ్లు దాటినా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసిన నేగి నేటి యువతకి ఆదర్శంగా నిలిచారు.

డిజిపిని కలిసి ఫిర్యాదు చేస్తాం: ఇంటూరి

విశాలాంధ్ర కందుకూరు రూరల్ :కందుకూరులోని కనిగిరి రోడ్డులో వారం క్రితం ఆర్యవైశ్య వ్యాపారి శివరామకృష్ణ ఇంట్లో దొంగలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ దొంగలు మళ్లీ ఈ రోజు ఉదయం శివరామకృష్ణ ఇంటికి వచ్చి, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ దాడి చేయబోయారు. ఈలోపు చుట్టుపక్కల వాళ్ళు అక్కడికి చేరుకోవడంతో దొంగలు పరారయ్యారు. విషయం తెలుసుకున్న కందుకూరు టిడిపి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పార్టీ నాయకులతో శివరామకృష్ణ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. మీ కుటుంబానికి నేను అండగా ఉంటానంటూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన పోలీసులపై నాగేశ్వరరావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం క్రితం సంఘటన జరిగితే దోషులను ఇంతవరకు ఎందుకు పట్టుకోలేకపోయారని నిలదీశారు. వారంలోపే మళ్ళీ, అది కూడా పట్టపగలు దొంగలు రెచ్చిపోతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలతో ప్రజల్లో భయాందోళనలు మరింత పెరిగాయని, దోషులను వెంటనే పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రెండు మూడు రోజుల్లో డిజిపి ని కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

పొదలకూరులో మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర–బ్యూరో నెల్లూరు: సర్వేపల్లి నియోజకవర్గం సూరాయపాలెం, యర్రబల్లి, విరువూరు గ్రామాలలో మంత్రి కాకాణి ప్రచారం కొనసాగించారు. జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ కార్యక్రమాలు, తన హయాంలో జరిగిన అభివృద్ధి గురించి మంత్రి కాకాణి వివరించారు. 2014 ఎన్నికలలో జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీ కూటమిగా అధికారంలోకి వచ్చాయని అనేక మోసపూరితమైన హామీలు ఇచ్చి వాటిని నిలబెట్టుకోలేదని మంత్రి విమర్శించారు. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చిన తరువాత మర్చిపోవడం చంద్రబాబుకు షరా మామూలుగా మారిపోయిందని విమర్శించార వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైతుల ప్రయోజనాల కోసం తాను పని చేస్తుంటే సోమిరెడ్డి మాత్రం తన సొంత ప్రయోజనాల కోసం నిరంతరం పనిచేశాడని సోమిరెడ్డి వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అల్లిపురంలోని ఆయన నివాసం చుట్టూ రైస్ మిల్లర్ల యాజమాన్యం ఉండేదని, వారితో ఎప్పుడూ లావా దేవీలు సోమిరెడ్డి పని అని మంత్రి అన్నారు. మే13వ తేదీన ఎన్నికల జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలని గత ప్రభుత్వం పనితీరు ప్రస్తుత ప్రభుత్వ పనితీరు ఏ విధంగా ఉందో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని మంత్రి కాకాణి కోరారు.

పర్యావరణ పరిరక్షణకు అదాని కృష్ణపట్నం పోర్ట్‌కు అవార్డు

విశాలాంధ్ర బ్యూరో–నెల్లూరు: అదాని కృష్ణపట్నం పోర్టులో పర్యావరణ పరిరక్షణ కాలుష్య నియంత్రణకు ఆరోగ్యం, భద్రత, వంటిరంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను గుర్తించి ప్రతిష్టాత్మకంగా 2023 అపెక్స్ ఇండియా గ్రీన్ లీఫ్ ప్లాటినం అవార్డును శుక్రవారం అపెక్స్ గ్రీన్ ఇండియా ఫౌండేషన్ న్యూఢిల్లీలో ప్రకటించారు.అవార్డు రావడం పట్ల అదాని కృష్ణపట్నం పోర్ట్ సీఈఓ జిజె రావు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాని కృష్ణపట్నం పోర్ట్‌లో ముఖ్యంగా చేపడుతున్న మొక్కల పెంపకం, ఆరోగ్య పరిరక్షణ, భద్రత, పై అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడంతోపాటుకాలుష్యనివారణకు ప్రతేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అలాగే ఉద్యోగులు కార్మికుల నైపుణ్యాభివృకి అదాని కృష్ణపట్నం పోర్ట్ కృషి చేస్తుదన్నారు."అపెక్స్ ఇండియా గ్రీన్ లీఫ్ అవార్డ్ 2023" కొరకు ఆయా రంగాలలో ఆదర్శప్రాయమైన విజయాలను గుర్తించి సంస్థలకు ప్లాటినం, అవార్డును ఫౌండేషన్ ప్రకటించింది. అపెక్స్ ఇండియా గ్రీన్ లీఫ్ అవార్డ్ 2023" పర్యావరణ పరిరక్షణ మెరుగుపరచడానికి మనం పని చేసే ప్రాంతం,నివసించే ప్రాంతాల్లో పర్యావరణ ప్రయోజనాల కోసం దీర్ఘకాలికమార్పులను సృష్టించేందుకు బాధ్యతాయుతమైన వినూత్న కార్యక్రమాలు అభ్యాసాలకు గుర్తింపుగా అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్లాటినం అవార్డు ప్రకటించడం తో మరింతగా పర్యావరణ, పరిరక్షణ, ఆరోగ్య, భద్రత కృషి చేస్తామన్నారు.

విపిఆర్‌తో ఆనం రామనారాయణరెడ్డి భేటీ

విశాలాంధ్ర బ్యూరో–నెల్లూరు: రాజ్యసభ సభ్యులు, టిడిపి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో వెంకటగిరి ఎమ్మెల్యే, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామ నారాయణరెడ్డి భేటీ అయ్యారు. శుక్రవారం నెల్లూరులోని విపిఆర్ గారి ఇంటికి చేరుకున్న ఆయన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు. ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై సమాలోచనలు చేశారు.

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసిన అల్లూరు మండల నాయకులు

విశాలాంధ్ర బ్యూరో–నెల్లూరు: నెల్లూరు లోక్ సభ పరిధిలోని నియోజ కవర్గాల వారీగా నాయకులూ, కార్యకర్తలు విపిఆర్ని కలిసి తమ సంఘీభావం తెలియజేస్తున్నారు. శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గ అల్లూరు మండలం ఈస్ట్ గోగులపల్లికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు శ్రీనివాసరావు, కాంతారావు, భాస్కర్, వెంకటేశ్వర్లు, శివ, స్వరూప్, ఓరంపాటి శ్రీనివాసులు, ఇతర ముఖ్యనాయకులు వేమిరెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

సోమిరెడ్డికి టిక్కెట్ ఖరారుతో సంబరాలు

విశాలాంధ్ర–ముత్తుకూరు: గత కొంతకాలంగా సర్వేపల్లి టికెట్ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కాదని మరొకరికి ఇస్తారంటూ ప్రచారం జరుగుతుంది. అయితే తనకు అధిష్ఠానం తప్పనిసరిగా సర్వేపల్లి టిక్కెట్ ఇస్తుందని భావించిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కింది స్థాయిలో నాయకులను కార్యకర్తలను కలుపుకొని నిరంతర ప్రచారం సాగించారు. మొదటి రెండు విడతల్లో సర్వేపల్లి టిక్కెట్టు ఎవరికి ఇవ్వకపోవడంతో తప్పనిసరిగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికే ఇస్తారని ప్రచారం ఇది వాళ్ళ కాలంలో ముమ్మరంగా సాగింది. అయితే అధిష్టానం మూడో విడత జాబితాలో సర్వేపల్లి టిక్కెట్టు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి ఇస్తున్నట్టు ప్రకటించడంతో సర్వేపల్లి నియోజకవర్గంలోనూ, మండలంలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు శుక్రవారం చేసుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆలయంలో మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, మల్లికార్జున యాదవ్ ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొ లిగర్ల శ్రీను, అక్కయ్య గారి ఏడుకొండలు, దువ్వూరు మహేష్, ఎల్లం గారి చిన్న రమణయ్య, శ్యాప్రసాద్ రెడ్డి, మురళి, షఫీ ఉల్లా, బ్రహ్మదేవం లో జరిగిన కార్యక్రమంలో బాణాసంచ పేల్చి, నాయకులు కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మదేవం నాయకులు సతీష్ నాయుడు మాట్లాడుతూ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గెలిచినా ఓడిన ఏనాడు సర్వేపల్లి నియోజకవర్గం వీడకుండా నియోజకవర్గంలో నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తూనే ఉన్నాడన్నారు. అలాగే పార్టీ ప్రతిపక్షంలో ఉన్న జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏవైనా సమస్యలు ఎదురైతే అక్కడికి వెళ్లి వాటిని పరిష్కరించేవాడు అన్నారు. సోమిరెడ్డి శ్రమ ఫలించిందని రానున్న ఎన్నికల్లో కచ్చితంగా భారీ మెజారిటీతో సర్వేపల్లి లో మూడవసారి గెలుపొంది శాసనసభలో అడుగుపెడతాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు చిన్న, వల్లూరు మోహన్ రావు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ కొల్లు కోదండరామయ్య, రాగల శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర– మనుబోలు:వెంకటాచలం మండలం, అనికేపల్లి గ్రామంలో శాలివాహన డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు హ్యాండ్ ఎంబ్రైడింగ్, పెయింటింగ్, డిజైనింగ్ కోర్సులు నేర్పుతున్న సెంటర్ నందు ఈ మహత్తరమైన ప్రోగ్రాం పెట్టకోవడం అందరికీ ఆనందదాయకం... ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ఆదిశేషయ్య, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు దా"యడవల్లి మల్లిఖార్జునరావు, నియోజకవర్గ శాలివాహన సాధికారత అధ్యక్షులు చల్లగిరి వరప్రసాద్, ఎమ్ కోటేశ్వరరావు, యస్ గోవిందయ్య, మండల ఎమ్‌పిటీసీ సభ్యురాలు రేణంగి సుమతి (మనోహర్ భార్య) మిగతా మహిళా కమిటీ సభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు.

విజయసాయి రెడ్డిని కలిసిన బుర్ర మధుసూదన్ యాదవ్

విశాలాంధ్ర–కందుకూరు రూరల్: రాజ్యసభ సభ్యులు, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి గౌరవనీయులు, పెద్దలు వి. విజయ సాయి రెడ్డి కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధరరెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడుటకు మాచవరం విచ్చేశారు. ఈసందర్భంగా కందుకూరు నియోజకవర్గం వైయస్సార్ సిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువను బహుకరించి స్వాగతం పలికారు.

అపరాధ రుసుము మాఫీని సద్వినియోగం చేసుకోండి: కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో– నెల్లూరు : ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు ఈ ఆర్థిక సంవత్సరం 2023 – 24 రెండవ అర్థ సంవత్సరం వరకు పన్నులపై విధించిన అపరాధ రుసుము (వడ్డీ) ను ఏక మొత్తంలో చెల్లింపుతో వడ్డీ మాఫీ చేస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ తెలియజేసారు. రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సచివాలయం అడ్మిన్ కార్యదర్శులు, అమెనిటీస్ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరానికి తేది. 31-03-2024 లోపు ఏకమొత్తంలో చెల్లించినట్లైతేనే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. అదేవిధంగా పన్నులను ఆన్-లైన్ ద్వారా (https://cdma.ap.gov.in) నెట్-బ్యాంకింగ్ ద్వారా కానీ, డెబిట్ / క్రెడిట్ కార్డు ల ద్వారా కానీ, ద్వారా కానీ చెల్లించవచ్చని తెలిపారు. మార్చి నెల ముగిసేందుకు ఉన్న మరో 9 రోజుల కాలవ్యవధిని సద్వినియోగం చేసుకుని, నగర పాలక సంస్థ రెవెన్యూ శాఖ అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పన్ను చెల్లింపుదారులను నేరుగా కలిసి బకాయిల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలోడిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ ఎస్.ఈ సంపత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులు, సచివాలయం అడ్మిన్, అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

బోర్డర్ పోలీస్ చెక్ పోస్ట్ సిద్ధం

-బద్దెవోలు రోడ్డు వద్ద పోలీసు చెక్ పోస్ట్

విశాలాంధ్ర –మనుబోలు: చెన్నై కలకత్తా 16వ నంబరు జాతీయ రహదారి పక్కన బద్దెవోలు రోడ్డు వద్ద నెల్లూరు మార్గంలో పోలీసులు బోర్డర్ చెక్పోస్ట్ ను శుక్రవారం సిద్ధం చేశారు. అసెంబ్లీ లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ పోలీస్ చెక్ పోస్ట్ వెలిసింది. గత ఎన్నికలలో నెల్లూరు జిల్లా చిత్తూరు జిల్లా పెళ్ళకూరు కాళహస్తి మధ్యలో బార్డర్ చెక్ పోస్ట్ పెట్టారు. 2022 సంవత్సరం ఏప్రిల్‌లో జిల్లాల విభజనతో తిరుపతి జిల్లాలో గూడూరుకలిపారు.ఫలితంగా బద్వేల్ రోడ్డు వరకు తిరుపతి జిల్లా. ఇక్కడ నుండి నెల్లూరు జిల్లాల హద్దులుగా గుర్తించారు.

ఇక పోలీసుల తనిఖీలు

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇక్కడ బోర్డర్ పోలీస్ చెక్ పోస్ట్ ప్రారంభించారు. ఎస్సై అజయ్ కుమార్ నేతృత్వంలో ఇక్కడ బందోబస్తు కొనసాగుతుంది. నాకాబందు స్టైల్లో ఇక్కడ పోలీసులు 24గంటలువాహనాలు తనిఖీలు చేస్తారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నగదు తరలింపు.మద్యం.సోదాలలో పట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని ఎస్సై అజయ్ కుమార్ తెలిపారు. ఈ చెక్ పోస్ట్ లో ఒక ఏఎస్ఐ. ఒక హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, హోంగార్డు మూడు షిఫ్టుల్లో పని చేస్తారని ఎస్సై తెలిపారు.